క్లుప్తంగా

రైతు భరోసా దరఖాస్తుకు నేడు చివరిరోజు

దమ్మపేట: నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు.. రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవడానికి నేటితో(బుధవారం) గడువు ముగుస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శీలం చంద్రశేఖర రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన పట్టాదారు పాసు పుస్తకాలు ఉండి, ఇప్పటివరకు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని రైతులు వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను అందజేయాలని ఆయన సూచించారు.

మావోల సమాచారం అందించండి

గుండాల: మారుమూల ఆదివాసీ గ్రామాలలో మావోయిస్టులు ఆశ్రయం పొందే అవకాశం ఉన్నందున స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలని టేకులపల్లి సీఐ సురేష్ అన్నారు. ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగారం, పెద్దవెంకటాపురం గొత్తికోయ గ్రామాల్లో మంగళవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నక్సల్స్‌కు సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని, గ్రామాల్లోకి అనుమానితులు వస్తే సమాచారం అందించాలని సూచించారు. ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

భద్రాచలంటౌన్: గ్రామీణ ప్రాంత స్వయం సహాయక బృందాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఔత్సాహక మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు సెర్ప్ డీపీఎంలు నాగజ్యోతి, రమాకాంత తెలిపారు. పట్టణంలోని రైతువేదికలో భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ర్యాంప్ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగదీష్, సీతా, రామయ్య, రాంబాబు, రీజినల్ కోఆర్డినేటర్ సునీత, అలీఫ్ పాల్గొన్నారు.

ఐటీఐలతో లక్ష్యాలు చేరువ

మణుగూరురూరల్: లక్ష్యాలను చేరుకునేందుకు యువతకు ప్రభుత్వ ఐటీఐలు సరైన మార్గాలు అవుతాయని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఐటీఐలో ప్రవేశాల కోసం ఐటీఐ కళాశాల బృందం సింగరేణి హైస్కూల్‌ను సందర్శించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశమై ఐటీఐ గురించి వివరించారు. ఐటీఐ కళాశాల అధ్యాపకులు, ట్రెనింగ్ ఆఫీసర్, జి.రవి, ఏటీఓ నర్సయ్య, పేటీసీ ఏటీఓలు జి.రాజేందర్, కె.పూర్ణచందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

మణుగూరుటౌన్: సింగరేణి అధికారుల దీర్ఘకాలిక సమస్యలైన పీఆర్‌పీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) స్థానిక కమిటీ ఆధ్వర్యంలో ఏరియా అధికారులు ఇన్‌చార్జ్ జీఎం వెంకటరామారావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో అధికారులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సీఎంఓఏఐ సభ్యులు ఇస్లావత్ సతీష్‌కుమార్, రమేశ్, సాయిల సురేశ్, కోడి కృష్ణమూర్తి , శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శోభన్, రామ్‌శంకర్, నర్సింహారావు, అనురాధ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు పంపిణీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్లగూడెం గ్రామ పంచాయతీకు మంజూరైన 32 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయా పత్రాలను మంగళవారం స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు భూక్యా శోభన్‌బాబు, భూక్యా ప్రసాద్, మాలోతు అలీబాబు పాల్గొన్నారు.

వంట కార్మికులకు శిక్షణ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం, నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాల కాంప్లెక్సుల్లో మంగళవారం ఆయా పాఠశాలల వంట ఏజెన్సీ మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజే ప్రభాకర్, నర్సాపురం హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు, దుమ్ముగూడెం హెచ్‌ఎం ఏవీ రామారావు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

మణుగూరురూరల్: హైదరాబాద్‌లో జరిగిన అండర్-14 స్విమ్మింగ్ పోటీలో స్థానిక పాలాది వివేక్ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించగా.. శ్రీభార్గవ హీరో-మైత్రి హోండా షోరూమ్స్ వారి ఆధ్వర్యంలో మంగళవారం వివేక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలియజేశారు. షోరూమ్స్ నిర్వాహకులు నాసిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, నేతాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సామా శ్రీనివాస్‌రెడ్డి, రావులపల్లి రామ్మూర్తి, వడ్డానం రమేష్, ఆలేటి అశోక్‌రెడ్డి, రెడ్డెమ్ శంకర్‌రెడ్డి, రమేష్, కోటేశ్వరి, కోచ్‌లు పాండురంగారావు, సందీప్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టళ్లలో వసతులు మెండు

- ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- వంతశాతం సీట్ల భర్తీకి కసరత్తు
- డివిజన్‌లో ఇప్పటికే మొదలైన అడ్మిషన్లు



దుమ్ముగూడెం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహం

దుమ్ముగూడెం: రాష్ట్రంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో ఒకటైన దుమ్ముగూడెం గ్రామంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యను పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు సంక్షేమశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వంఅన్ని సౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేసినప్పటికీ ప్రతిఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుండడంపై దృష్టి సారించారు.

గతేడాది దుమ్ముగూడెం ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో 77మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 55కు చేరుకుంది. చర్లలో గతేడాది 67 మంది, భద్రాచలంలో 84 మంది ఉన్నారు. వీరిలో 10వ తరగతి పూర్తి అయ్యి కాలేజీలకు వెళ్లే వారు ఉండగా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలనే ఉద్దేశంతో అధికారులు ఈ హాస్టళ్ల ప్రాముఖ్యతపై ప్రచారం చేస్తున్నారు.

3 నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు..

భద్రాచలం డివిజన్ పరిధిలోని దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో వంద మంది విద్యార్థులకు అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగినా జిల్లా కలెక్టర్ అనుమతితో మరింత మంది విద్యార్థులను చేర్చుకునే అవకాశాలు ఉన్నాయి.

ఈ ఏడాది 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు వసతి గృహంలో విద్యార్థులు చేరేందుకు అధికారులు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టి 100శాతం విద్యార్థులను చేర్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.అంతేకాక ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. విద్యార్థులు ఎస్సీ వసతి గృహాల్లో చేరి విద్యను అభ్యసించే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత చదువులకు కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలకు సులభమార్గంగా ఉంటుందని, దీనిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ప్రచారం నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలు ఇవే..

ఎస్సీ హాస్టల్‌లో చేరి విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం 4 జతల యూనిఫామ్స్, 2 జతల షూస్, 1 జత చెప్పులు అందజేస్తోంది. ప్లేట్-గ్లాస్‌లు, బెడ్‌షీట్లు, దిండ్లు, టవళ్లు, చలికోట్, పరుపు, మంచం ఉచితంగా అందజేస్తోంది. అలాగే నోట్ పుస్తకాలు, బ్యాగులు, లైబ్రరీ పుస్తకాలను అందజేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ మెటీరియల్స్‌తోపాటు, ప్రతి విద్యార్థికి సబ్బుల బిల్లు రూ.62 అందజేస్తున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, రోజు ఒక పండు, వారంలో ఆరు రోజులు గుడ్లు ఆదివారాల్లో నాన్‌వేజ్‌తో బగార అన్నం అందజేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఉచితంగా అందజేస్తుండడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను వసతి గృహాల్లో చేర్పించేందుకు ముందుకు రావాలి. అలాగే విద్యార్థులు వసతి గృహాల్లో చేరి మంచి విద్యను పొందడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నత శిఖరాలవైపు ప్రయాణించాలి.

– మోతుకూరి శ్రీకాంత్, ఎస్సీ సెల్ నాయకుడు

ప్రచారం ప్రారంభించాం...



ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాం. వసతి గృహాల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. వసతి గృహంలో చేరిన విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు ఉచితంగా అందజేస్తాం. ఇక్కడి విద్యార్థులకు ఉన్నత చదువులకు మార్గం సులభంగా ఉంటుంది.

– కొప్పుల హనుమంతరావు, ఏఎస్‌డబ్ల్యూఓ

ప్రత్యేక బోధన అందిస్తాం..



దమ్మపేట: ప్రత్యేక అవసరాలు గల బాలుడితో మాట్లాడుతున్న ఎంఈఓ కీసర లక్ష్మి

దమ్మపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నైపుణ్యాలున్న ఉపాధ్యాయులచేత ప్రత్యేకంగా బోధన అందిస్తామని మండల విద్యా శాఖ అధికారి కీసర లక్ష్మి తెలిపారు. మంగళవారం దమ్మపేట గ్రామంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఎంఈఓ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లల ఇంటి వద్దకు వెళ్లి ప్రత్యేక బోధన, అలవెన్సులు తదితర అంశాలను పిల్లల తల్లితండ్రులకు వివరించారు. పాఠశాలలో చేర్పించడానికి ఒప్పించారు. అనంతరం విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఐఆర్పీ కోఆర్డినేటర్లు నాగలక్ష్మి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సమ్మిళిత విద్య అవశ్యకతను తెలుపుతూ మంగళవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయుడు సతీష్ మాట్లాడుతూ.. ఒకే తరగతి విధానంలో సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరతలు గల పిల్లలకు సహాయ బోధనోపకరణాలు ఉపయోగిస్తూ విద్యను అందించే విధానమే సమ్మిళిత విద్య ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు రాగిణి, బాబురావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినికి ఐఐటీలో సీటు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్(దమ్మపేట) గ్రామంలోగల ప్రభుత్వ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బి.భాను ఐఐటీ-జామ్-2025లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని ఎంపీసీఎస్ విభాగం నుంచి ఐఐటీ-జామ్ ప్రవేశ పరీక్షకు హాజరు కాగా.. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీ హైదరాబాద్‌లో సీటు సాధించినట్లు చెప్పారు. కాగా, కళాశాల విద్యార్థిని ఐఐటీలో సీటు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ తోపాటు కళాశాల అధ్యాపక బృందం, తోటి విద్యార్థినులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాథపురంలో శివారులోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో స్థానిక రైతు అడపా నాగేశ్వరరావు భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. రూ.70 వేల సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా మోటారు పెట్టారు. ఇనుగంటి రాము, పామర్తి వెంకటేశ్వరరావు, కోమార్ల దుర్గాప్రసాద్ కనకం వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం

చంద్రుగొండ: ప్రపంచ పరిశుభ్రత శ్రామికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బెండాలపాడు గ్రామ పంచాయతీ కార్మికులను కాంగ్రెస్‌పార్టీ అనుబంధ సేవాదళ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఫజల్‌బక్ష ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్మికులతోపాటు పంచాయితీ కార్యదర్శి రోహిత్‌ను సత్కరించారు.

వైద్య ఖర్చులకు ‘నేస్తం’ చేయూత

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వలదాసు వెంకటమ్మ ఇప్పటికే గర్భాశయ సంబంధిత వ్యాధికి ఆపరేషన్ చేయించుకొని ఉండగా.. డెంగీ ఆపై సీవీడీపీ అను వైరస్ వ్యాప్తి చెంది శరీరం మొత్తం చలనం లేకుండా పోయింది. వైద్య ఖర్చులతోపాటు.. నెలకు రూ 20వేల ఇంజెక్షన్ చేయించాల్సి ఉండగా.. మోరంపల్లిబంజరకు చెందిన నేస్తం వేల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మంగళవారం రూ 10వేల ఆర్థికసాయాన్ని అందించింది. ఆమె వైద్య ఖర్చులకు ట్రస్ట్ తమవంతు సహకారమందిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు చింతా అంకిరెడ్డి,సంకా సురేష్, కైపు రమేష్‌రెడ్డి, డి.బాలనారాయణ రెడ్డి, ఆవుల శివ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: బాధితులకు సాయమందిస్తున్న నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

చర్ల: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చర్ల మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ కాకర్లపూడి విజయలక్ష్మికి వసుధ ఫౌండేషన్ మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆమె.. వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజును ఆశ్రయించడంతో ఆయన ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం చర్లలో జరిగిన కార్యక్రమంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణ అధికారి వేగేశ్న రామకృష్ణరాజు చేతుల మీదుగా విజయలక్ష్మికి చెక్కు అందజేశారు.

కేంద్ర పథకాల అమలుపై గ్రామసభ



దమ్మపేట: ఐటీడీఏ పీఓతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకుడు శ్రీరాములు

చంద్రుగొండ: మండలంలోని వెంకటియాతండాలో కేంద్ర పథకాల అమలుపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. దర్తీ ఆబ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం అమలు తీరుపై మండల స్థాయి అధికారులు గ్రామసభ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ఆధార్‌కార్డులు, స్వయం సహాయక సంఘాలు, సమగ్ర శిక్షాఅభియాన్, కులధృవీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతాలు, పీఎం కిసాన్ క్రెడిట్‌కార్డులు, అయుష్మాన్ భారత్ కార్డులు, అంగన్‌వాడి కేంద్రాల ద్వారా వారికి అవసరమైన పత్రాలను సంబంధిత శాఖాధికారులు జారీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏఓ వినయ్, ఎంపీఓ ఖాన్ పాల్గొన్నారు.

సర్వీస్ చార్జీలు లేకుండా చూడాలి

దమ్మపేట: ఐటీడీఓ భద్రాచలం, వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్తీ ఆబ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం క్యాంపులో దరఖాస్తులకు సర్వీస్ చార్జీలు లేకుండా చూడాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌ను, ఆదివాసీ నాయకుడు కారం శ్రీరాములు కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై మండలంలోని జగ్గారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దరఖాస్తును ఆన్‌లైన్ చేయడానికి మీ సేవ నిర్వాహకులు రూ.45లు చెల్లించాలని చెప్పగా.. ఆదివాసీ నాయకుడు కారం శ్రీరాములు పీఓతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి, ఎటువంటి సర్వీస్ చార్జీ లేకుండా చూడాలని కోరారు. దీనిపై పీఓ సానుకూలంగా స్పందించారు. కాగా, జగ్గారంలో క్యాంపును తాత్కాలికంగా వాయిదా వేశారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

అశ్వారావుపేటరూరల్: వానాకాలం సీజన్ నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోగల పాత రెడ్డిగూడెం, తిరుమలకుంట కాలనీ, పాత మామిళ్లవారిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్వర పీడితుల సర్వే, దోమల నివారణ మందు పిచికారీ, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్, డీపీఎంఓ మోహన్, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

పినపాక: ఇంటర్ మొదటి సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో స్థానిక శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ బైపీసీ విభాగం ఫస్టియర్ ఫలితాల్లో ఎస్.ఊహ 440 మార్కులకు గాను 438, ఎం.దివ్య 436 మార్కులతో స్టేట్ ర్యాంకులు సాధించారు. ఎంపీసీలో ప్రత్యూష 470 మార్కులకు గాను 467, పి.నందు 466 మార్కులతో స్టేట్ ర్యాంకులు సాధించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యార్థులు ప్రతిభ చాచడంపై యాజమాన్యం వారిని అభినందించారు. కరస్పాండెంట్ పగడాల సతీష్ రెడ్డి, డైరెక్టర్లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ గంగిరెడ్డి నిరోషా రెడ్డి, గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి అభినందించినవారిలో ఉన్నారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం



గుండాల: భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన రైతులు

గుండాల: గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు భూ భారతిలో పరిష్కారం అవుతాయని తహసీల్దార్ తిరుమల అన్నారు. మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దరఖాస్తు చేసుకున్న ప్రతీ రైతు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వారసత్వం, హద్దులు, సాదాబైనామా తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సదస్సుల్లో కాకుండా రెవెన్యూ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు ఇచ్చినా పరిష్కరిస్తామని అన్నారు.

ప్రశాంతంగా రెవెన్యూ సదస్సులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రామన్నగూడెం, అశ్వారావుపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా సాగాయి. ఈ సందర్భంగా సదస్సుల్లో తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, డీటీ హుస్సేన్ ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ రెండు సదస్సలలో వివిధ భూ సమస్యలపై మొత్తం 226 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎం వైఖరి సరికాదు..

మణుగూరురూరల్: మణుగూరు ఆర్టీసీ డీఎం వైఖరిని నిరసిస్తూ.. డిపో ఎదుట ఆర్టీసీ జేఏసీ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డ్రైవర్లను కౌన్సెలింగ్ చేయడం కోసం తయారు చేసిన చార్ట్‌లో మార్పులు, అభ్యంతరాల కోసం వెల్ఫేర్ బోర్డ్ కమిటీ మెంబర్ పీఎస్ రెడ్డి ద్వారా పిలిపించి యూనియన్ నాయకులను అవమానించడం సరైన చర్య కాదన్నారు. ఇప్పటికైనా డీఎం తన మొండి వైఖరిని వీడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ లింగయ్య, వి.పవన్ కుమార్, సీఐటీయూ నాయకులు ఆర్‌ఎన్ రావు, జె.సుధాకర్, ఎస్ఆర్ బాబు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు బి.రాములు, బి.సంపత్, ఆర్టీసీ కార్మికులు ఎల్‌వీ రెడ్డి, కె.మల్లికార్జున్, ఎస్ఆర్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట పనులు పూర్తి చేయాలి



భద్రాచలం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం బృందం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం గోదావరి ముంపునకు గురి కాకుండా రూ.38 కోట్లతో సుభాష్ నగర్ కాలనీ వైపు నిర్మిస్తున్న కరకట్టను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్‌లు అన్నారు. నిర్మాణంలో ఉన్న కరకట్ట పనులను సీపీఎం బృందం మంగళవారం పరిశీలించింది. పనులు నత్తనడకన సాగడంపై అసంతృప్తికి వ్యక్తం చేసింది. అనంతరం సీపీఎం బృందం స్థానిక ఇరిగేషన్ ఈఈ, డీఈ, జేఏలతో భేటీ అయ్యి కరకట్ట పనులు ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఈ మహమ్మద్ జానీ మాట్లాడుతూ.. కరకట్ట నిర్మాణంలో అంతర్భాగమైన హై లెవెల్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేసి ఎస్టిమేషన్‌ను నేషనల్ హైవే అధికారులకు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తిచేసి సుభాష్ నగర్ కాలనీ లోకి వరద రాకుండా తగు చర్యలు చేపడతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, బండారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

ములకలపల్లి: మండలవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ‘అమ్మమాట-అంగన్‌వాడీ బాట’కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పుర వీధుల్లో ప్రదర్శన చేస్తున్నారు. చిన్నారులచేత సామూహిక అక్షరాభ్యాసాలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కిషోర బాలికలకు పల్లీచిక్కీలు, పౌషకాహారాన్ని అందిస్తున్నారు. పాగళ్లపల్లి సెక్టార్లోని పాగళ్ళపల్లి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్ఞానసుందరి పాల్గొని మాట్లాడుతూ.. పోషకాహార అవశ్యకతను వివరించారు. రాచన్నగూడుం కేంద్రంలో జగన్నాథపుర క్లస్టర్ సూపర్‌వైజర్ ఆర్.నాగమణి పాల్గొని, చిన్నారులచేత అక్షరాభ్యాసం చేయించారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు సెక్టార్ పరిధిలోని సవళ్లగూడెం-1, బీజీకొత్తూరు, మామిళ్లవాయి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీల్లో అందిస్తున్న వసతులు, పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, శైలజ, బొర్రా రజిత, తల్లులు, గర్భిణులు, స్థానికులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: గుమ్మడవల్లిలో నిర్వహించిన అవగాహన ర్యాలీ..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక సీడీపీఓ ముత్తమ్మ చేతుల మీదుగా ఐదేళ్లలోపు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, పోషకాహారంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సౌజన్య, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పరిశీలన



తుమ్మలచెరువులో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం: మండలంలో మొండికుంట, తుమ్మలచెరువు బీట్ ప్రాంతాల్లో అటవీ శాఖ ప్లాంటేషన్‌ను మంగళవారం ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధికారులు పరిశీలించారు. మొండికుంటలో ఫారెస్ట్ నర్సరీ, తుమ్మలచెరువులో ప్లాంటేషన్‌ను అధికారులు పరిశీలించారు. ప్లాంటేషన్‌కు వచ్చిన నిధులు, ఖర్చు, వేసిన ప్లాంటేషన్‌పై అధికారులు తనిఖీ చేసి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, బీట్ ఆఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నార్కోటిక్ తనిఖీలు



గంజాయి అనర్థాలను వివరిస్తున్న టౌన్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గంజాయి సేవిస్తున్నారనే అనుమానిత ప్రాంతాల్లో నార్కోటిక్ టీం, నార్కోటిక్ డాగ్‌తో మంగళవారం భద్రాచలం పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో గంజాయి పరీక్ష కిట్‌ను ప్రదర్శించి, కిట్ ఏ విధంగా పని చేస్తుందో ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఎస్ఐ స్వప్న, ఎస్ఐ రామకృష్ణ, నార్కోటిక్ సిబ్బంది, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

బండి కాదు.. మొండి!



సింగరేణి బస్సును నెడుతున్న స్థానికులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ సింగరేణి హైస్కూల్ బస్సులు జగమొండిలా వ్యవహరిస్తున్నాయి. అవి తరచూ రోడ్డుపై నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మంగళవారం సాయంత్రం గుట్టమల్లారం ప్రాంతంలో విద్యార్థులను దింపేందుకు వెళ్తూ బస్సు సాంకేతిక లోపంతో నిలిచిపోగా.. స్థానికులు ఇలా సాయపడ్డారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడవక ముందే ఒకే బస్సు రెండుసార్లు నిలిచిపోవడం పట్ల విద్యార్థుల కుటుంబాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఫిట్‌నెస్ లేక వాహనాల నిలిచిపోతున్నాయని, అధికారులు దృష్టి సారించి సమస్య తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.